తెలుగు సాహితీ సాంస్కృతిక సంప్రదాయ స్ఫూర్తి

సిలికానాంధ్ర విళంబి ఉగాది ఉత్సవం

# 'ఎనుకుదురాట'

అచ్చ తెలుగు అష్టావధానం

కుదురరి (అవధాని): డా. పాలపర్తి శ్యామలానంద ప్రసాద్

మార్చి 17, 2018

శివవిష్ణు దేవాలయం, లివర్ మోర్, కాలిఫోర్నియా

**రచన, సంకలనం**

మాతా కోటేశ్వర రావు

మాతా గంగా భవాని శాంకరీ దేవి

సుజనరంజని సంపాదక వర్గం

తాటిపాముల మృత్యుంజయుడు

తమిరిశ జానకి

ఫణిమాధవ్ కస్తూరి



*His Holiness, Courtallam Sankaracharya, Jagadguru*

SRI SIDDHESWARANANDA BHARATI SWAMY

***Peetadhipati - Siddheswari Peetam***

**Office :**
**Mounaswamy Mutt**
**Courtallam-627 802**
Thirunelvali Dist. (T.N.)
TAMIL NADU
Ph. 04633 - 283707

పరమహంస, పరివ్రాజకాచార్య, జగద్గురు
**శ్రీసిద్ధేశ్వరానంద భారతీస్వామి**
**సిద్ధేశ్వరీ పీఠాధిపతి, కుర్తాళం**

**Camp Office :**
Swayam Siddha Kaali Peetam
4th Line, Ravindra Nagar
GUNTUR - 522 006 (A.P.)
Ph. 94402 08103

# ఆశీర్వాద శ్రీముఖము

శ్రీ మాతా కోటేశ్వరరావు, అతని భార్య విశాఖి లలితా పీఠ భక్తులు. అమ్మవారి కార్యక్రమాలకు ఎంతో సేవచేసేవారు. ఈ మధ్య అమెరికా వెళ్ళి అక్కడ కూడా దైవ, సేవా కార్యక్రమాలు నిర్వ హిస్తున్నారు.

ప్రసిద్ధులైన అవధానులీమధ్య అమెరికాలో ఎక్కువగా సాహిత్య ప్రదర్శనలు చేస్తున్నారు. అచటి నగరాలలో, భారతదేశంలో ఆశుకవితావధానాలలో పూరించిన సమస్యలు, దత్తపదులు, వర్ణనలు ఆకర్షణీయమైనవిగా భాసిస్తున్నవి.

వాటిలో కొన్నింటిని ఎంపికచేసి ఒక చిన్న పుస్తకంగా ప్రచురించటం పద్య కవితకు చేస్తున్న మంచి సేవ. ఈ కృషిని ప్రశంసిస్తూ ఇంకా వివిధ రంగాలలో సేవ, దైవ మార్గంలో తపసాధన చేస్తూ కోటేశ్వరరావు పరమేశ్వరి అనుగ్రహానికి మరింతగా పాత్రుడు కావాలని ఆశీర్వదిస్తున్నాను.

నారాయణ స్మరణతో . .

**సిద్ధేశ్వరానంద భారతీస్వామి**







## SRI SAKTHI PEETAM

**(CHARITABLE TRUST - REGD.57/2017)**

**Plot No.550-B, 1st Floot, Anitha Square, Road No.92**
**Jubilee Hills, HYDERABAD-500 033, Telengana**

Founder
***His Holiness Jagadguru***
SRI SIDDHESWARANANDA BHARATI SWAMIJI

Peetadheeswari
***Her Holiness Mataji***
RAMYANANDA BHARTI SWAMINI

**Camp Office : Sri Sakthi Peetam, D.No.5-43-12, 4/9, Brodiepet, Guntur-522 002**

# ఆశీర్వాద శ్రీముఖము


*శ్రీ మాతా కోటేశ్వరరావు, శ్రీమతి మాతా భవానీదేవి దంపతులు విశాఖపట్నంలో అనేక ఆధ్యాత్మిక, సాహిత్య, సేవా కార్యక్రమాలలో పాల్గొంటూ ఆయా రంగాలలో ఎంతో కృషిచేస్తున్నారు. వీరు యిరువురూ లలితాదేవిని ఉపాసిస్తూ, అమ్మవారి సేవలో తరిస్తున్నారు. శ్రీమతి భవానీదేవికి సాహిత్యరంగంలో కూడా ప్రవేశం ఉన్నది. ఆధ్యాత్మిక పత్రికలలో అమ్మవారి మీద కవితలు, వ్యాసాలు రచించారు.*

*ఈ దంపతులు అమెరికాకు వెళ్ళి, అక్కడ కూడా వివిధ కార్యక్రమాల నిర్వహణలో తమ వంతు కృషి చేస్తున్నారు. అమెరికాలో తెలుగు సాహిత్య విశిష్టతను అందరికీ తెలిసేటట్లుగా, వాళ్ళ మనస్సులను ఆకట్టుకునే విధంగా ఎందరో తెలుగు సాహితీవేత్తలు, తెలుగు భాషాభిమానులు (సంస్థలు) అవధానం, ఆశుకవిత్వం మొదలైన వైవిధ్యమైన కార్యక్రమాలను నిర్వహించటం జరుగుతున్నది. అందులో భాగంగా శ్రీమాతా కోటేశ్వరరావు, శ్రీ భవానీదేవి దంపతులు ఈ పుస్తకాన్ని ప్రచురించటం హర్షణీయం.*

*సాహిత్యరంగానికి వారు చేస్తున్న ఈ సేవను అభినందిస్తూ, వివిధ రంగాలలో సేవలను విస్తరింపజేసే శక్తిని వారికి, వారి కుటుంబానికి అనుగ్రహించే విధంగా మా పీఠ దేవత అయిన కాళీదేవి ఆశీస్సులను అందిస్తూ . . .*

*నారాయణ స్మరణతో . . .*

**రమ్యానంద భారతీస్వామిని**



## శ్రీ లలితానంద భారతీ స్వామి
## హైదరాబాద్

శుభాశీస్సులు

శ్రీమాతా కోటేశ్వరరావు, భవానీ దంపతులు విశాఖపట్టణంలోని శ్రీ లలితాదేవి భక్తులు. ఇటీవల వీరు అమెరికాలో శ్రీ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ గారి అచ్చతెలుగు అవధానం తిలకించి తన్మయం చెంది యదాతథంగా ఈ పుస్తకంలో పొందుపరచారు. అంతే గాక క్లుప్తంగా అవధాని గారి పరిచయము, అవధాన విద్యనభ్యసించే వారికి ఉపయోగకరమైన పుస్తకాల వివరాలు కూడా తెలియజేయడం అభినంద నీయం. చిరంజీవి భవానీ వ్రాసిన ప్రశంశా పద్యాలు రమణీయంగా ఉన్నవి. కొద్దికాలంలోనే చిరంజీవి భవానీ కూడా అవధాన ప్రదర్శనలు ఇచ్చే శక్తిని శ్రీ లలితా అమ్మవారు ఆమెకు సంపూర్ణంగా అనుగ్రహిం చాలని ఆశిస్తూ.

*నారాయణ స్మరణతో*

***లలితానంద భారతీ స్వామి***

*Satavadhanisekhara, Vidyavaridhi*
**Dr. PALAPARTY SYAMALANANDA PRASAD**
M.A.(Tel.), Ph.D., M.A.(San.), Ph.D.
# 76-8/1-28, Lalitha Nagar, Vijayawada-520 012
Andhra Pradesh, India   Phone : +91 866 - 2414322
Cell : +91 94403 46287  E-mail : syamalananda.p@gmail.com



*శ్రీ మాత్రేనమ:*

# మున్నుడి

“జేజే సిలికానాంధ్ర”కు
జే జే జే అచ్చ తెలుగు జేజమ్మకిదే
చేజోతలు “మాతా” వా
రీ జిలుగుకు వెలుగు నిడుట కెదగడు మెత్తున్

పాలకడలి తెలుగు బాసయు, నడవడి
చిలుకు కవ్వమగుచు వెలికి తెచ్చి
అబ్బురముల చూపునది “సిలికానాంధ్ర”
అచ్చ తెనుగును కుదురాట గనుడు

“ఏటిమొగ” పండు విట్లొప్ప, విలంబి
నచ్చ తెనుగుకు పెనుపీట నిచ్చినారు
పూల దో“సిలికానాంధ్రము” నకు తీపి
గురుతుగా నిల్చియుండు నెల్లరకు నిటుల

చిటికెన వ్రేలికి నెక్కిన
బొటికాయగ నొంటరయితి పుడమి నలుదెసల్
చిటపట నెనుగుదురాటకు
నటునిటు బెసగక నొనర్తు నచ్చ తెనుగునన్

అమ్మకు నాన్నకు మ్రొక్కెద
నిమ్మెయి నాళ్ళెళ్ల దిరుగ నిచ్చిరి పుటుకన్
నెమ్మది నా“సిరితల్లి”కి
నిమ్ముగ దండములనిత్తు నెపుడుంగావన్

నెనరులతో

– పాలపర్తి

*“అసమాన అవధాన సార్వభౌమ”*
**డా. పాలపర్తి శ్యామలానంద ప్రసాద్**

RAJIV GANDHI UNIVERSITY OF KNOWLEDGE TECHNOLOGIES (A.P.)
IIIT SRIKAKULAM
"Avadhana Sudhakara", "Avadhana Bharati", " Avadhana Bheema", "Sathavadhani"
Dr. RAMBHATLA PARVATHEESWARA SARMA M.A., M.A., Ph.D.,
Assistant Professor (C ), Dept. of Telugu &
Personal Secretary (I/c) to Director
Office : +91 8985866374
Mobile : +91 9247859580
E-Mail : pstodirector.sklm@rgukt.in
Website: www.rambhatla.in

15.07.2018

## "తగినాట"

శ్రీ మాతా కోటేశ్వరరావు, భవానీ దంపతి నాకు సుపరిచితులు. సాహిత్యాభి మానులు. అవధాన ప్రియులు. శ్రీశ్రీశ్రీ విశాఖ లలితాపీఠంలో అమ్మవారి దయకు పాత్రులైనవారు. శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామివారి అనుగ్రహాన్ని పరిపూర్ణంగా పొందినవారు. కవితాగోష్ఠుల్లోను, అవధానాది ఉన్నత వేదికలపైన శ్రీలలితానందభారతి మార్గదర్శకత్వంలో వీరు సమున్నతపాత్రను పోషిస్తూరావడం అస్మదాదులకు ఆనంద దాయకమైంది. వాసనాబలంతో ఏ నాటి పుణ్యఫలమో వీరికి సాహిత్యాసక్తి, శక్తి కలిగాయి. ప్రదర్శితమవుతూ పేరు ప్రతిష్ఠలూ తెచ్చుపెడుతున్నాయి.

ఆటల మేటియాట! "కుదురాట"గ పేరును బడ్డ యాట! ము
న్నీటికి సాటి లోతు గల నిచ్చలు పల్కెడు మాట మూట! మో
మాట మదేల తెల్పగను మాదని తియ్యని నోట? వేయు నా
నాటికి పెద్ద పీట తగు నమ్మకమై యెద నిల్చి యంతటన్!!

గురుతుల్యులు, విశ్వవిఖ్యాతులు, బ్రహ్మశ్రీ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ గారి అచ్చ తెలుగు అవధానాన్ని సిలికానాంధ్రవారు నిర్వహించడం ఒక గొప్పవేడుక. అందులోని

విశేషాలను ఇలా సాహిత్యలోకానికి చిన్ని పొత్తంగా అందించడానికి ఈ జంట పడ్డ కృషి అద్వితీయమైంది. అవధాన సంప్రదాయ విశేషాలను సోదాహరణంగా ప్రస్తావిస్తూ.... ఈ సందర్భంగా వీరు అచ్చొత్తించడం ఔచితీమంతంగా, అమోదయోగ్యంగా ఉంది. ఈ ప్రక్రియలోని ప్రఖ్యాతమైన, ఆలోచనాత్మకమైన అంశాలను వరుసగా పరిచయం చేసి వివరించడంలోను, నాటి సభను మనముందు ఆవిష్కరించడానికి చేసిన ప్రయత్నం లోను సదరు రచయితలు సఫలీకృతులయ్యారు. వీరి భాషా, సాహిత్య, సాంస్కృతిక వైదగ్ధ్యానికి ఈ పుస్తకం ఒక మచ్చుతునక. అటు అవధానికీ, ఇటు పరిచయకారులకూ కూడా ఇది "తగినాట". ఇతోధిక రచనా వ్యాసంగంతో వివిధ దేశాల విఖ్యాతులౌతూ ఈ కవ సాహిత్యభ్యుదయ సమున్నతులు కావాలని లలితా పరమభట్టారికను ప్రార్థిస్తూ . . .

*అవధాన సుధాకర, అవధాన భారతి, అవధాన భీమ*
"శతావధాని" **డా. రాంభట్ల పార్వతీశ్వర శర్మ**
సహాయాచార్య, ఐఐఐటి శ్రీకాకుళం
రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం
ఆంధ్రప్రదేశ్, భారతదేశం
**www.rambhatla.in**
కరవాణి : +091 9247859580

# సుజననీయం

అవధానానికి, సిలికానాంధ్రకు అవినాభావ సంబంధం వుంది. కాలచక్రంలో పదహారు సంవత్సరాలు వెనక్కి వెళ్ళితే. . . 2001 వ సంవత్సరం ఆగస్టు నెల నాల్గవ తేదీ : సమయం సాయంత్రం 5.00 గంటలు : స్థలం శివ విష్ణు దేవాలయం, లివర్మోర్ : సందర్భం – సిలికానాంధ్ర సంస్థ ప్రారంభోత్సవ ఉత్సవం : కార్యక్రమం : అష్టావధానం, అవధాని: సహస్రావధాని శ్రీ గరికపాటి నరసింహరావు, అంటే సిలికానాంధ్ర పుట్టిన వేడుకలు అవధానంతో ప్రారంభమయ్యాయి అన్నమాట. అప్పటినుండి ఎప్పుడు వీలైతే అప్పుడు వివిధ రకాల అవధానాలను సిలికానాంధ్ర నిర్వహిస్తూనే వుంది. ఉదాహరణకు కొన్ని

| | | |
|---|---|---|
| ఆగస్టు 4, 2001 | : | అష్టావధానం – మహా సహస్రావధాని గరికపాటి నరసింహారావు |
| ఆగస్టు 4, 2007 | : | శతక పద్యధారా సమ్మోహనం – పంచ సహస్రావధాని మేడసాని మోహన్ |
| మార్చి 24, 2012 | : | జంట కవుల అష్టావధానం – సహస్రావధానులు కడిమెళ్ళ వరప్రసాద్, కోట లక్ష్మీనరసింహం |
| ఆగస్టు 3, 2013 | : | సంగీత నవావధానం – డాక్టర్ మీగడ రామలింగ స్వామి |
| మార్చి 30, 2014 | : | నేత్రావధానం – శ్రీమతి లలితా కామేశ్వరి, శ్రీమతి రమా కుమారి |
| ఆగస్టు 6, 2016 | : | ద్విగుణిత అవధానం : మహా సహస్రావధాని గరికపాటి నరసింహారావు |
| మార్చి 17, 2018 | : | ఎనుకుదురాట – డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ |

అవధాని పాలపర్తి వారు సిలికాన్ వ్యాలీ వచ్చినప్పుడు వారిని నాకు వీలైన రీతిలో ఈ క్రింది పద్యముతో ఆహ్వానించాను.

అచ్చ తెనుగున కుదురుగ ఆటలాడ,
వచ్చితివుగాది దినమున భళిర అనగ
నీల సంతోష ! సరిలేరు నీకు ఎవరు
ఇచ్చు శ్రీవిళంబి శుభము ఏడు మనకు

వారు చేసిన ఎనుకుదురాట వివరాలు ఈ చిన్ని పుస్తకములో చదవ బోతున్నారు. అవధానంపై సిలికానాంధ్రా ప్రచురణల విభాగం తీసు కొస్తున్న మొదటి పుస్తకం ఇది. మున్ముందు మరిన్ని పుస్తకాలు ఇతర సాహిత్య ప్రక్రియలపై ప్రచురింపబడతాయి. శుభాభినందనలు !

**తాటిపాముల మృత్యుంజయుడు**
ప్రధాన సంపాదకుడు
**సుజనరంజని,** అంతర్జాల మాసపత్రిక

# తొలి పలుకు

*మాతృ దేవో భవ పితృ దేవో భవ ఆచార్య దేవో భవ*

*శ్రీ మాత్రేనమః శ్రీ గురుభ్యోనమః*

బాల్యం నుండి మాకు కవితలన్నా, పద్యములన్నా మక్కువ. అది దిన దిన ప్రవర్ధమానమై మా మనస్సులలో పెరుగుతూ వచ్చింది. ఆ మక్కువ ఎక్కువగా మారి అవధానములు, సమస్యా పూరణములపై ఆసక్తి కలిగింది.

పద్య సాహిత్యంలో అవధాన ప్రక్రియ తలమానికమైనది, అత్యంత విశిష్టమైనది, మహోన్నత మైనది. ఎందుకంటే ఇందులో అవధాని యొక్క ప్రతిభా పాటవాలు, సమయస్ఫూర్తి, ధారణ, భావ పదజాల వ్యక్తీకరణ అవగతమౌతాయి. ఆ కోవలో అగ్రగణ్యులు తిరుపతి వేంకట కవులు, కొప్పరపు సోదర కవులు. వివిధ రకములైన అవధానాలున్నా పద్య ప్రధానమైన అష్టావధానం, శతావధానం, సహస్రావధానాలే ప్రేక్షకులను రంజింపజేస్తాయి.

ఈ సాహిత్యప్రక్రియ వందల సంవత్సరములుగా మహో న్నతంగా ఉండడం అరుదైన విశేషం. కవిత్వాన్ని ప్రదర్శనాత్మక కళగా సాహిత్యరంగంలో అవధాన ప్రక్రియ తీర్చిదిద్దింది. అవధాన విద్య తెలుగువారి సంపద. ఆశువు, ధారణ, పద్యధాటి ఇలా బహు విద్యల సమోపేతమైనది.

పద్యానికి ఈ కాలంలో విలువ లేదు, తెలుగు మాట్లాడుట లేదు అనే వారున్నారు. అయినప్పటికీ అవధానాన్ని ఆదరించేవారు దేశ విదేశాలలో ఎందరో వున్నారు. అవధాన విద్యలో నేటి యువతీ

యువకులు ఉత్సాహంగా పాల్గొని రాణిస్తున్నారు. అంటే పద్య సాహిత్యానికి మంచి రోజులు వచ్చినట్లే.

గరికపాటి నరసింహా రావు గారి అష్టావధానం, శ్రీ మాడుగుల నాగఫణి శర్మ, శ్రీ మేడసాని మోహన్, శ్రీ కడిమెళ్ళ వరప్రసాద్, శ్రీ వద్దిపర్తి పద్మాకర్, శ్రీ కోట లక్ష్మినరసింహం, శ్రీ రాంభట్ల పార్వతీశ్వర శర్మ అష్టావధానములు, శ్రీ మీగడ రామలింగ స్వామి గారి సంగీత నవావధానము ప్రత్యక్షముగా వీక్షించడం జరిగింది. చి. సౌ. బులుసు అపర్ణ, చి. సౌ. పుల్లాభట్ల శాంతి స్వరూప జంట కవయిత్రులు జనరంజకంగా నిర్వహించిన అవధానం, ప్రత్యేకంగా ఘంటావధానం విశాఖపట్నం లలితా పీఠంలో చూడటము జరిగినది. యూ ట్యూబ్ వారి ధర్మమా యని పరోక్షంగా ఎన్నో అవధానాలు చూడటము జరిగినది.

శ్రీ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ గారి అచ్చ తెలుగు ఎనుకుదురాట చూచుట ఇదియే ప్రథమం. అనుభవనీయులు, పెద్దలు, విషయ విపులీకరణలో సమర్థులు, వివిధ విద్యా విషయాలపై అవగాహన వున్నవారు, సాహితీ కోవిదులు, సంస్కృతాంధ్రాలలో పెక్కు రచనలు చేసిన వారు, భక్తి రచనలు చేయుటలో దిట్ట, అవధానాలు ఆద్యంతము రసభరితముగా నడుపు నైపుణ్య కుదురరి అయిన శ్రీ శ్రీ శ్రీ శ్యామలానంద అనవరతము శ్లాఘనీయులు, అభినందనీయులు.

పద్యములో భావస్ఫూర్తి, ప్రసన్నత, వినమ్రత, సుకుమార పదజాలము, గాంభీర్యకవనం ఈయన అవధాన ప్రతిభకు చిహ్నాలు. ఊహా చిత్రాలు రచించుటలో మేధావి.

"తిరుగలి, రోలు, రోకలి, పాత్రము" అను అచ్చ తెలుగు పదాలను ప్రయోగించి పతి పత్నుల మధ్య సయోధ్య ఎలా కుదుర్చు కోవాలో సమయోచితముగా వివరించారు.

"ఇంకెక్కడి కైనను చనవలె నచ్చరులున్" ఆశువుగా ఆయన చెప్పిన పద్యము సమస్యకు తగిన అర్థ శబ్దరీతి ప్రసంశనీయం.

పురాణంలో "ఇంతితై వటుడింతై" అనే పద్యానికి ఆయన చెప్పిన విపులీకరణ అద్భుతం. వామన ఘట్టాన్ని వేదికపై ఆవిష్కరించారు. వటువు యొక్క విరాట్ రూపాన్ని మూడు విధాలుగా విస్తరించినట్లుగా చెప్పారు. "మూలాధారం, స్వాధిష్ఠానము, మణిపూరకము, విశుద్ధి, అనాహతం, ఆజ్ఞాచక్రము, సహస్రారం ద్వారా పైపైకి చేరుకొనే క్రమపద్ధతి". "పురుషసూక్తంలో అన్ని రూపాల్లో తానైయున్నట్లు చెప్పబడిన తీరు". "యోగ మార్గంలో మానవ జన్మ సార్థకం చేసుకునేపద్ధతి" ఏది ఏమైనా మానవ జీవిత పురోగతివైపు ఆ పద్య అర్థాన్ని భాసిస్తూ ఆయన చెప్పిన తీరు ముదావహం.

వేరొక పద్యము: "ఆకాశంబున నుండి శంభుని శిరంబందుండి" పద్యములో కూడా ఆలోచన లేకుండా ముందుకు అడుగులు వేసినట్లైన ఎవ్వరికైనా పెక్కు అనర్థాలు వాటిల్లును అని చెప్తూ సమయస్ఫూర్తితో "నిదానం ప్రధానం" నిదానంగా, కుదురుగా నడచుకున్నట్లైన ఆ వ్యక్తుల జీవన వాహిని అలజడి లేకుండా నిర్మలంగా, శాంతంగా, సాగుతుందని అవధాని గారు సోదాహరణంగా వివరించారు.

అవధానికి అవగాహన ఉండాలి గాని ఆగ్రహం వుండకూడదు. అడుగరి (పృచ్ఛకుడు) అడ్డుతగిలినప్పుడు కఠిన పదము పెదవి జారిన, మాట మిగిలిపోతుంది. సంయమనం పాటించాలి. దానిలో పాలపర్తి వారు ప్రథములు. శబ్ద, అర్థ, జ్ఞానంతో అవధానం ఆద్యంతమూ ఆహ్లాద కరంగా సాగింది.

సిలికానాంధ్ర సంస్థ వారు తెలుగు భాషకు చేస్తున్న ఇతోధిక సేవకు ఈ అచ్చతెలుగు అవధానం ఒక మచ్చు తునక. విదేశాలలో

తెలుగు భాషను విస్తృతపరచుటకు చేస్తున్న సేవలు శ్లాఘనీయము. విదేశాలలో వుండే తెలుగువారు మన సంస్కృతి సాంప్రదాయాలను మరువకుండా ఉండడానికి వారు చేస్తున్న భాషా ఉద్యమం ఎంతగానో ఉపయోగపడుతుంది. తెలుగు రాష్ట్రాలలో వున్న తెలుగు ప్రజలు సిలికానాంధ్రా తెలుగు ఉద్యమాన్ని "స్ఫూర్తిగా" తీసుకోవలసిన దుస్థితిలో వున్నారు. విదేశాలలో పిల్లలకు బాల్యం నుండి తెలుగు భాష మరచిపోకుండా ఉండటానికి 2007 సంవత్సరములో "మన బడి" సంస్థను నెలకొల్పి అమెరికా 35 రాష్ట్రాలలోనూ, 12 ఇతర దేశాలలోనూ సుమారుగా 9,000 మంది విద్యార్థులతో విజయవంతంగా నిర్వహించడం అనితర సాధ్యం. చదువులే కాకుండా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

సిరులు పట్టు గొమ్మ సిలిక నాంధ్ర యనిన
తెలుగు భాషకెంతొ వెలుగునిచ్చి
సేవ సలుపు లక్ష్య సిద్ధిగ జనులకు
బృంద సభ్యులెల్ల సుందరముగ

ఈ అవకాశం మాకు కలుగ జేసిన సిలికానాంధ్రా సంస్థ వారికి ధన్యవాదములు. ప్రధానముగా తాటిపాముల మృత్యుంజయుడు గారికి మరి మరి కృతజ్ఞతాభివందనములు. ఇంతటి మహత్కార్యాన్ని మాతో చేయించి చాలా ధైర్యం చేశారు. అందుకాయన మాకెల్లప్పుడూ అత్యంత ఆత్మీయ మిత్రులు. వారికి, వారి కుటుంబ సభ్యులకు ఆ లలితా పరా భట్టారిక కటాక్షము అన్నివేళలా కలగాలని కోరి ప్రార్థిస్తున్నాము.

కాలమంత సద్వినియోగకరము కాగ
ఘనతరవకాశమిచ్చిన ఘనహృదయులు
మీకు పరివార జనులకు మేలునొసగు
నటుల లలితాంబ వేడెద నమ్రతగను

తాటిపాముల మృత్యుంజయుడు గారి ఆత్మీయ ఆహ్వానంతో సిలికానాంధ్రా వారు నిర్వహించిన విళంబినామ సంవత్సర ఉగాది ఉత్సవాలలో భాగంగా శ్రీ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ గారి అచ్చతెలుగు అవధానము చూసే భాగ్యము మాకు దక్కినది.

అవధాని గారు ఆద్యంతము తన పూర్వ విశేష అనుభవాన్ని, పాండిత్యాన్ని, మృదుస్వభావాన్ని ప్రదర్శిస్తూ అనేక విషయములను ఈ అవధానం ద్వారా అందరికీ ఎంతో కొంత నేర్పించాలన్న మక్కువతో ఆయన సాగించిన తీరు కడు ప్రశంసనీయం. అనేక సాహిత్య, సాంఘిక సమస్యలు స్పృశిస్తూ చేసిన అచ్చతెలుగు అవధాన ప్రక్రియ ఆహూతులను విశేషంగా ఆకర్షించింది.

అచ్చ తెనుగులోన అవధాన కర్తగా
అవతరించి నారు ఆంధ్ర యందు
ఆవకాయ కలిపి అన్నమే తిన్నట్లు
ఆవురావురనుచు అవధరింతు

ఆట విడుపు లేదు అప్రమత్తత మెందు
అదుగరదుగు చిక్కు కడ్డుపడదు
అంత సులువు గాదు అవధానిమెప్పింప
అటుల నిటులనైన ఆట కట్టు

అచ్చ తెనుగున ఎనుకుదురాట నాడి
అందుకొనుచు ప్రశంసము నాదరమున
యశము బడసితివయ్య యీయవనిలోన
కోటి వందనములు సేతు కూర్మి తోడ

దేశ విదేశాలలో మన తెలుగువారి కీర్తి పతాకాన్ని ఎగురవేసిన ప్రధాన మంత్రి పాములపర్తి వారైతే, సాహిత్య అచ్చ తెలుగు ఉద్యమానికి ఊపిరి పోస్తున్న వారు మన పాలపర్తి వారు. వారికివే మా నమస్సులు.

కుర్తాళం శంకరాచార్య జగద్గురువులు శ్రీ శ్రీ శ్రీ సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామివారి గురు కృప తోడను శ్రీ లలితాంబ కటాక్షం తోను ఈ సదవకాశం మాకు కలిగినందులకు ధన్యులము.

*సహృదయ భవదీయులు*

**మాతా కోటేశ్వర రావు**

**మాతా గంగా భవాని శాంకరీ దేవి**

# అవధానం - విశేషాలు

**అవధానము అనగా నేమి?**

అవధానము అనేది తెలుగు వారికి మాత్రము సొంతమైన ప్రత్యేక సాహిత్య ప్రక్రియ. ఇది ఒక అపురూప వినోద విజ్ఞాన సమ్మేళనము.

అప్రమత్తతే అవధానమని అమరకోశం అంటున్నది.
మనో యోగ క్రియ అని శబ్దార్థ కల్పతరువు అభిప్రాయము.
ఏది ఏమైనా అవధానమందరూ అవధరించ వలసినదే.

క్రీ. శ. 11 వ శతాబ్దంలో నన్నయ్య గారి మిత్రుడు నారాయణ భట్టు ఈ అవధాన ప్రక్రియ చేపట్టినట్టుగా శిలా శాసనముల ద్వారా, పుస్తకముల ద్వారా తెలియుచున్నది. అవికూడా కొన్ని పద్యాలలో పూరించడమే గానీ పెద్దగా కాదు. అటుపిమ్మట ఫిబ్రవరి మాసము ఇరువది రెండవ తారీకు పద్దెనిమిది వందల డెబ్బది రెండవ సంవత్సరములో ఆగిరిపల్లి గ్రామంలో మాడభూషి వెంకటాచార్యులు గారు మొట్ట మొదట విజ్ఞానదాయకంగా, వినోదాత్మకంగా, వ్యక్తిత్వ వికాసమునకు పనికొచ్చే విధముగా అవధాన ప్రక్రియను రూపకల్పన చేసినారు. దానినే తిరుపతి వెంకట కవులు కొప్పరపు సోదర కవులు అనుసరించి బహుళ ప్రచారంలోనికి తెచ్చి ఖ్యాతిని గడించారు.

**ఖ్యాతి గడించిన అవధానులు :**

సర్వశ్రీ మాడభూషి వెంకటాచార్యులు, తిరుపతి వెంకట కవులు, కొప్పరపు సోదర కవులు, ప్రసాదరాయ కులపతి, ఆదిభట్ల నారాయణ దాసు, చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రి, తాడేపల్లి రాఘవ నారాయణ శాస్త్రి,

సి. వీ. సుబ్బన్న, శాంతి నారాయణ, వేదుల సత్యనారాయణ శాస్త్రి, దుర్భాక రాజశేఖర శతావధాని, దూపాటి సంపత్కుమారాచార్య, దేవులపల్లి సోదర కవులు, గాడేపల్లి వీర రాఘవ శాస్త్రి, గుమ్మన్న లక్ష్మి నరసింహ శర్మ, మేడసాని మోహన్, మాడుగుల నాగఫణి శర్మ, గరికపాటి నరసింహ రావు, పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, కడిమెళ్ళ వర ప్రసాద్, నందూరి దత్తాత్రేయ శర్మ, అష్టకాల రామనరసింహ శర్మ, అనుమల వెంకట శేష కవి, వేలూరి శివరామ శాస్త్రి, కాశీ కృష్ణాచార్యులు, వెంపటి సదాశివ బ్రహ్మం, జాన దుర్గామల్లిఖార్జున రావు, నేమాని రామజోగి సన్యాసి రావు, రాళ్లబండి కవితా ప్రసాద్, వద్దిపర్తి పద్మాకర్, కోట లక్ష్మి నరసింహం, మరుమామిళ్ళ దత్తాత్రేయ శర్మ, మీగడ రామలింగ స్వామి, అత్యంత పిన్న వయస్కులైన అవధానులు కడిమెళ్ళ శ్రీవిరించి, రాంభట్ల పార్వతీశ్వర శర్మ, బులుసు అపర్ణ, పుల్లాభట్ల శాంతిస్వరూప.

**అవధానాలు రకాలు** : ముఖ్యంగా మూడు విభాగాలుగా వున్నాయి.

1. **వేదసంబంధ అవధానాలు** : స్వరావధానం, అక్షరావధానం

2. **సాహిత్యావధానాలు** : అష్టావధానం, శతావధానం, ద్విశతావధానం, సహస్రావధానం, మహా సహస్రావధానం పృచ్ఛకుల సంఖ్యను బట్టి 20 వరకు వున్నాయి.

3. **సాహిత్యేతర అవధానాలు** : మూడు రకాలను ముఖ్యంగా చెప్పుకోవచ్చు.

అ) **సాంకేతిక అవధానాలు** : నేత్రావధానం, అంగుష్ఠావధానం, పుష్పావధానం,ఘంటావధానం.

ఆ) **శాస్త్రసంబంధ అవధానాలు** : గణితావధానం, జ్యోతిషావధానం, అక్షర గణితావధానం, వైద్యావధానం.

ఇ) **కళాసంబంధ అవధానాలు** : నాట్యావధానం, చిత్రకళావధానం, సంగీతాష్టావధానం, ధ్వన్యావధానం, చతురంగావధానం, నవరసావధానం, సంగీత నవావధానం.

ఇలా వేద, సాహిత్య, శాస్త్ర, సాంకేతిక, కళా సంబంధ అవధాన ప్రక్రియలున్నాయి. కానీ జనాలకు ఎక్కువ రక్తి కట్టించేవి సాహిత్య అవధానాలు.

అవధానంలో అంశాలు నాలుగు భాగాలుగా విభజించవచ్చు. ధారణా సహిత సాహిత్య, సాహిత్యేతర, మరియు ధారణా రహిత సాహిత్య, సాహిత్యేతర.

1. **ధారణా సహిత సాహిత్య అంశం** : సమస్యా పూరణం, దత్తపది, వర్ణన, నిషిద్ధాక్షరి, నిషేధాక్షరి, చిత్రాక్షరి, వ్యస్తాక్షరి, నిర్దిష్టాక్షరి లేదా న్యస్తాక్షరి, వృత్తమాలిక, ఏకసంథా గ్రహణం, లిఖితాక్షరి, శ్లోకాంధ్రీ కరణం, నిర్దిష్టభావానువాదం.

2. **ధారణా రహిత సాహిత్య అంశం** : ఆశువు, పురాణం, అప్రస్తుత ప్రసంగం, కావ్యానుకరణ, కావ్యోక్తి, కీర్తన, గేయం, చిత్రకథ, వచన కవిత, మినీ కవిత, అంత్యాక్షరి, అక్షర విన్యాసం.

3. **ధారణా సహిత సాహిత్యేతర అంశం** : ఘంటా గణనం, పుష్ప గణనం, నామ సమీకరణం, యాంత్రిక గణనం.

4. **ధారణా రహిత సాహిత్యేతర అంశం** : సంగీతం, చదరంగం, వార గణనం, పేకాట.

**సాహిత్య అవధానం :** సాహిత్య ప్రక్రియలను జోడించి పృచ్ఛకులు అడిగిన ప్రశ్నలకు అవధాని సమాధానాలు ఇవ్వడమే సాహిత్య అవధానము.

పృచ్ఛకుల సంఖ్యను బట్టి అష్టావధానం, శతావధానం, ద్విశతావధానం, సహస్రావధానం, మహా సహస్రావధానం ఇలా అనేక రకములు ఉన్నవి. కానీ వీటిలో అష్టావధానమే గొప్ప పేరు గడించింది.

**అష్టావధానం :**

పైన చెప్పిన సాహిత్య ప్రక్రియలలోని ఎనిమిది అంశములను ఒక్కొక్క పృచ్ఛకుడు ఒక అంశము నిర్వహిస్తూ ప్రశ్నలను సంధిస్తూ ఉంటే అవధాని ఏమాత్రము తడబడ కుండా సందర్భోచితంగా, భావయుక్తంగా, చమత్కారంగా సమాధానాలు ఇస్తారు. వీటిలో కొన్ని ప్రక్రియలు సోదాహరణంగా పరిశీలిద్దాం.

**1. సమస్యా పూరణం:**

"సమస్యతే సంక్షిప్యతే ఆనయేతి సమస్య : సమస్యాతు సమాసార్థ" అని అమరసింహుని నిర్వచనం. పృచ్ఛకుడు లోక విరుద్ధంగా వున్న అంశమును సమస్యగా ఒక పద్యములోని పాదాన్ని ఇస్తారు. అది వినగానే సాధ్యమేనా అన్నట్లుగా ఉంటుంది. గానీ అవధాని తడబడకుండా అర్థానుగతి కలిగేలా తక్కిన మూడు పాదాలు చెప్పడంలోనే తన ప్రజ్ఞ కనబడుతుంది. పద్యములోని అర్థాన్ని తన చమత్కృతినుపయోగించి లోకామోదమైన అర్థంతో చెప్పగలగాలి.

ఉదా : అ : "సారా గొనె శివుడు లోక సంరక్షణకై" అన్న పృచ్ఛకుని ప్రశ్నకు కడిమెళ్ళ వర ప్రసాదు గారు :

పారా వారము నందున
నారని పెను జిచ్చు వోలె హాలాహలమే
పారగా నద్దానిని మన
సారా గొనె శివుడు లోక సంరక్షణకై

అని సమాధానం ఇచ్చారు. ఎక్కడి సారా ఎక్కడి క్షీర సాగర మధనం!!

ఆ : “వంకాయల చెరుకు రసము వడివడి యుబికెన్” ఈ సమస్యకు కంద పద్యములో పూరించమన్నారు

చక్కని కాయలు తేవలె
చిక్కంగ మసాల నలది చేయగ పులుసున్
మక్కువగ నోట తినగా
వంకాయల చెరుకు రసము వడివడి యుబికెన్

2. **నిషేధాక్షరి :**

పృచ్ఛకుడు అడిగిన పద్యాన్ని అవధాని చెప్పడం ఆరంభించగానే పృచ్ఛకుడు అడ్డు తగిలి కొన్ని అక్షరాలను నిషేధిస్తాడు. వాటిని ఉపయోగించకుండా, అర్థం చెడకుండా అప్పటికప్పుడు పదాలను మార్చుకుంటూ ఆ పద్యాన్ని పూర్తిచెయ్యడం అవధానంలో కష్టమైన చర్య.

3. **నిషిద్ధాక్షరి :**

ఇందులో పృచ్ఛకుడు ముందుగానే పదాలలో ఏ ఏ అక్షరాలు వాడకూడదో చెప్పుతారు. ఆ అక్షరాలను వదలివేసి పద్యాన్ని పూర్తి చెయ్యాలి.

ఉదా : అవధాని మేడసాని మోహన్ గారిని క, చ, ట, త, ప లు రాకుండా సీతా కళ్యాణం గురించి చెప్పమనగా

సరస నిధి రామభద్రుడు
ధరణిజ ఎదలోన మధుర ధారనుడయ్యెన్
సురలెల్ల హర్షమందిరి
విరాజమాన సువిలాస విభవమెసగన్

ఇలా చెప్పారు. పై అక్షరాలు లేకుండా అడిగిన భావం వచ్చేలాగా పదప్రయోగంతో పద్యం అల్లడం సరస్వతి పుత్రులైన వారికే సాధ్యం.

4. **దత్త పది :**

ఇచ్చిన పదాలతో పృచ్ఛకుడు అడిగిన భావాన్ని అవధాని చెప్పాలి. ఆ పదాలు అర్థానికి పృచ్ఛకుడు కోరిన భావానికి ఏమాత్రం సంబంధం ఉండదు. అవధాని ప్రతిభతో వాటిని ఆ భావంలో చొప్పిస్తారు. ఆ పదాలు ఏ చంధస్సుకిమిడుంటాయో ఆ పద్యంలో అర్థానుగుణంగా సరిపెట్టి వ్రాసిన దానిని దత్తపది అంటారు.

ఉదా : అ :యువ అవధాని రాంభట్ల పార్వతీశ్వర శర్మ గారిని సచిన్, ధోని, విరాట్, వార్న్ అన్న క్రికెట్ క్రీడాకారుల పేర్లు ఇచ్చి భారతార్థంలో చెప్పమనిన

వ్యాస చిన్మయ రూప నీ వ్రాత మహిమ
రమ్యముగ గంటి నేను విరాట్స్వరూపు
చాలునదియ అధోనిధులేల ననుచు
నిష్ఠ జైమిని వేదవార్నిధి మధించె

"వ్యాసచిన్మయ" "విరాట్స్వరూప" "అధోనిధులు" "వేదవార్నిధి" అని కదు హృద్యంగా చెప్పారు.

ఆ : తిరుగలి, రోలు, రోకలి, పొత్రము ఈ పదాలు వాడుతూ ఇంటాయన కోపాన్ని తగ్గిస్తూ సమన్వయ పరచాలి

పొత్రమున పతి క్రోధము బోసి రుబ్బి
తిరుగలినలుక రోలును త్రిప్పివేయ
రో కలియుగాన సమమిద్దరును నిజంబు
ఒద్దికను కాపురమ్మును దిద్దు కొనుమ

5. **వర్ణన:**

పృచ్ఛకుదు తన ఇష్టమొచ్చిన అంశాన్ని తాను కోరిన ఛందస్సులో వర్ణించమంటారు.

ఉదా : అ : 'అవధానం పట్ల యువత ఆకర్షితులవ్వాలంటే' అనే విషయంపై కడిమెళ్ళ శ్రీవిరించిగారు వర్ణించమంటే రాంభట్ల పార్వతీశ్వర శర్మ ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా చెప్పిన రీతి :

పాఠశాల నుండి పద్యమ్ము పఠియింప
నేర్పవలయు, చెప్పనోర్పువలయు
నీతులందుకాక చేతలన్ చూపింప
నీ వధానముండు నేండ్లు నేండ్లు

పాఠశాల నుండి పద్యం చదవడం నేర్పాలి. నేర్పడంలో ఓర్పు చూపాలి. నీతులు చెప్పడం కాదు, చేతల్లో చూపించాలి. అప్పుడు పద్యం నిలిచి అవధానం ఎన్ని ఏండ్లయినా జీవిస్తుంది.

ఆ : సిలికానాంధ్ర పట్టుకున్న తెలుగు అనే దారమును చుట్టుకున్న సాహిత్య, నాట్య, సంగీత, ఆరోగ్య, అంతర్జాల, పర్యావరణ, సంజీవిని అను పుష్పాల మాలను యువ నాయకత్వమును వర్ణించండి.

కవన గాన చిత్ర కళలు కలిసిగూడి
విద్యనేర్చి యువత ఘన విజయమొంది
తెలుగు బావుటాను దిశల నెగురవేయు
సిలిక నాంధ్ర మేలున్ చేయు నెల్లవేళ

6. **ఆశుకవిత్వం** :

పృచ్ఛకుడు దేనిమీదనైనా ఆశువుగా పద్యం చెప్పమని కోరవచ్చు.

ఉదా : అ : 'సమాజంలో విభేదాలు లేకుండా విశ్వమానవుని ప్రాదుర్భావం' గూర్చి ఆశువుగా చెప్పమనిన రాంభట్ల పార్వతీశ్వర శర్మ గారిట్లు చెప్పారు.

మనుజులైన చాలు మనకేల హంగులు
భేదమరయుటెల్ల వాదములకు
సకలజీవరాశి కొకటిగా ప్రాణమ్ము
ప్రకృతి నేర్పుమనకు పాఠములను

ఆ : తిరుపతి వెంకటేశ్వర స్వామి దర్శనానికి వెళ్ళినపుడు పూజారులు తెరవేసేస్తే మీ మానసిక పరిస్థితి ఏమిటి? స్వామిని ఎలా ప్రార్థిస్తారు?

వేచితిని తెరలుపడినన్
కాచుకొని యచట మెదలక కదలక వరుసన్
తూచి అడుగువేయగనే
కాంచక నిను వెళ్ళనికను కరుణనుగనుమా

**7. న్యస్తాక్షరి :**

దీనిలో పృచ్ఛకుడు తన ఇష్టం వచ్చిన అక్షరాలను ఇచ్చి అవి పద్యంలో ఏ పాదంలో ఎన్నో అక్షరంగా రావాలో చెప్పుతారు. అవధాని వాటిని గుర్తుంచుకొని, కోరిన వృత్తంలో పద్యం చెప్పాలి. ఈ ప్రక్రియను వ్యస్తాక్షరి అనికూడా అంటారు.

**8. చిత్రాక్షరి :**

ఇది ధారణకు సంబంధించిన అంశము. ఒక వాక్యం లేదా పద్య పాదములోని అక్షరాలు, అంకెలు వేసి, వేరువేరుగా క్రమము తప్పించి అవధానము జరుగుతున్నప్పుడు మధ్య మధ్యలో అవధాని గారిని అడుగుతారు. అవధానిగారు ఆ పద్యపాదాన్ని క్రమము తప్పకుండ చెప్పవలెను.

ఉదా : కాలుష్యం కోరల్లో చిక్కుకున్న ప్రకృతిని, పర్యావరణాన్ని పరిరక్షించు కోవాలంటే ఏమిచేయాలి? తేటగీతిలో పద్యం చెప్పమనగా:

ప్రకృతి పారిపోయె వసుధ బండబారె
వాయవు జలము కాలుష్యమాయె కాన,
పచ్చదనమును పోషించు పైరు పంట
శుచియు శుభ్రత పాటింప శోభనిండు

**9. అప్రస్తుత ప్రసంగం :**

అవధాని ఏకాగ్రతను చెడగొట్టడానికి పృచ్ఛకుడు అనేక ప్రయత్నాలు చేస్తారు. ఈయన్ని అడ్డుకునే వారుండరు. అతను అడగని ప్రశ్న ఉండదు.

ఈ ప్రక్రియలే కాకుండా పుష్ప గణనం, ఘంటా గణనం వంటి అనేక సాహిత్యేతర ప్రక్రియలను కూడా ఈ అష్టావధానంలో జోడిస్తారు. కేవలం తెలుగువారికే సొంతమైన ఈ అవధాన ప్రక్రియను మనం కాపాడు కోవాలి.



సిలికానాంధ్ర వారి ఆధ్వర్యములో 2018 విళంబి నామ సంవత్సరం ఏటిమొగ ఉత్సవాలలో భాగంగా కాలిఫోర్నియా, లివర్మోర్ శివ విష్ణు దేవాలయ ప్రాంగణంలో జరిగిన తొట్టతొలుత అచ్చతెలుగు ఎనుకుదురాట (అష్టావధానం) ఆహుతులను ఆకట్టుకొని కడురమ్యంగా జరిగింది. కుదురరి శ్రీ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ గారు తనకున్న 500 ల అవధానాలు చేసిన అనుభవంతో సభ్యులను సుదీర్ఘ వివరణలతో రంజింపజేశారు. ఇక్కడ ఒక ప్రత్యేక విశేషం వుంది. అవధాని గారికి ఇదే రోజు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు ఉగాది పురస్కార ప్రదానం చేస్తున్నామని ప్రకటించిన, సిలికానాంధ్ర వారు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ప్రాముఖ్యతనిచ్చి ఇక్కడికి విచ్చేసారు. అందుకే మక్కువగా ఈ కార్యక్రమాన్ని రక్తికట్టించారు.

# ఎనుకుదురాట

ఎనుకుదురాట లో పాల్గొన్న సాహితీ వేత్తలు

| | | |
|---|---|---|
| కుదురరి | (అవధాని) | : శ్రీ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ |
| నడుపరి | (సంచాలకులు) | : శ్రీ కిరణ్ ప్రభ |
| అడుగరులు | (పృచ్ఛకులు) | |
| నుడి కట్టు | (వర్ణన) | : శ్రీఇక్బాల్ మహ్మద్ |
| వ్రాకట్టు | (నిషిద్ధాక్షరి) | : శ్రీ రావు తల్లాప్రగడ |
| నుడిచిక్కు | (సమస్య) | : శ్రీమతి శారద కాశీ వజ్జల |
| వ్రాపెట్టు | (చిత్రాక్షరి) | : శ్రీమతి కల్యాణి శాఖమూరి |
| ప్రానుడి | (పురాణం) | : శ్రీ మధు ప్రఖ్యా |
| నుడిపెట్టు | (దత్తపది) | : శ్రీమతి శాంతి కూచిభొట్ల |
| వడికట్టు | (ఆశువు) | : శ్రీ దీన బాబు కొండుభట్ల |
| నుడికొట్టు | (అప్రస్తుత ప్రసంగం) | : శ్రీ ఆనంద్ కూచిభొట్ల |

# ప్రారంభం

*శ్రీ మాత్రే నమః  శ్రీ గురుభ్యోనమః*

శ్రీ లక్ష్మీగణపతి నన్
బాలింపుము జాగుమాలి వర వరద నినున్
పోలెడు వేలుపు లెవ్వరు
మూలాధారాంతరస్థ మోహిత జగతీ

తర్వాత గురు వందనము చేసినారు

గుజ్జు వేల్పు లచ్చి ఒజ్జ గుఱ్ఱము సామి
అమ్మ వారు చూడ ఆడు చుంటి
తమ్మి కంటి తోడ తానుండ ముక్కంటి
వారి కొలిచి ఇచట పలుకు చుంటి

సిలికానాంధ్రను పెద్దలు జిలిబిలి పలుకుల
తెలుగుకు చేసెడి మేలున్
పలికిన పలుకులు చాలవు
తలచెద వారిని పెలుచన తగ వెలయింపన్,

ఏటిమొగ పండువీయది ఈ విళంబి
మేలు కూర్చును గావుత మీకు నాకు
పూల దోసిలికానాంధ్ర పొంగు గాక
చక్క నయినట్టి తీరున సాగు గాక

అవధానంబన నాటగాదు కవితా వ్యాపార మింతేని కా
దవధానంబన సర్వజీవులకు అత్యావశ్యకంబౌనుగా
అవధానంబది తెల్గువారలకు స్వీయంబైన సంపత్తు మీ
రవధానంబులనాదరింప వలెనయ్యా శ్రద్ధ నల్దిక్కులన్

కూచిభొట్ల ఆనంద్ **(నుడికొట్టు అడుగరి – అప్రస్తుత ప్రసంగం)** :

విళంబి పేరున్న కొత్త ఏడాది మప్పిదాలు (అచ్చ తెలుగులో శుభాకాంక్షలు తెలియజేసారు).

**నుడి కట్టు (వర్ణన) :**

సిలికానాంధ్ర పట్టుకున్న 'తెలుగు' అనే దారమును చుట్టుకున్న సాహిత్య, నాట్య, సంగీత, విద్య, సాంకేతిక, అంతర్జాల, ఆరోగ్య, ప్రాచీన, ఆధునిక, సామాజిక, పర్యావరణాలతో గుదిగుచ్చబడిన పూలదండలా అగుపించినది. దీనిని వర్ణిస్తూ తేటగీతిలో పద్యము చెప్పమనగా

కైత పాట ఆటయు బొమ్మ కలిసినట్టి
బ్రతుకు నడిపింపవలె వట్టి బతుకులేల
పుట్టుకను చక్క దిద్దగ పుట్టె నిదియు
తెలిసి నేర్వగ పుట్టుక తీరు మారు

*భావం :* కవిత్వం, పాట, ఆట, చిత్ర లేఖనం తదితర లలిత కళలు మన జీవితానికి అన్వయించుకొని అంతర్భాగంగా వాటిని మలచుకొని జీవించి నటులైన మన జీవితానికి సార్ధకత ఏర్పడుతుంది. వాటిని మనము తెలుసుకొని, నేర్చుకొని అవలంబించినటులైన మన పుట్టుక తీరు మారునట్లుగా కుదురరి గారు వర్ణించారు.

**వ్రాకట్టు (నిషిద్ధాక్షరి) :**

మన మతమున అమ్మను అందరూ దేవతగా భావిస్తారు. అయితే శని సింగణాపురి నందున వనితకు ఎందుకు అనుమతి వలదో చెప్పుమా, ధర్మ సూక్ష్మము ఏమిటని కంద పద్యములో వివరించమనెను.

చనగా దనుచు గిరి నిడిరి
చనమే కనమే సనినిట సరియే యౌరా
మనుట దగుగాక మడిగా
మనకది లేకుండ పుటక మారెద మనరే

*భావం :* శని సింగణాపురి లో స్త్రీలు వెళ్ళుటకు ఆటంకము వున్నది గావున నిషేధించడమైనది. నియమ నిష్టలు ముఖ్యం గాబట్టి ఆ విధముగా కొలుచుకోవలెను. ఆ నియమ ఉల్లంఘనకు పుట్టుక మార్చు కుందామని అనుకున్నారని పద్య భావన. అయినా ఆ నిషేధము ఇప్పుడు లేదు.

**నుడి చిక్కు (సమస్య) :**

'వంకాయల చెరుకు రసము వడి వడి యుబికెన్' అనే పద్య పాదమును సమస్యగా ఇచ్చినారు.

వంకాయలిపుడు తెచ్చితి
వంకలు లేకుండ అరకు వచ్చెదు చెఱకున్
పొంకము గానుగ పెట్టితి
వంకాయల చెరుకు రసము వడి వడి యుబికెన్

భావము : వంకాయలున్న సంచిలో వంకలు లేని మంచి చెరుకు గడల గానుగ పెట్టిన రసమును కూడా ఉంచినందున వంకాయలు తీసి చూడగా వంకాయల నుండి చెరుకు రసము వడి వడిగా యుబికెనని చెప్పారు.

**ప్రానుడి (పురాణం) :**

ఇంతింతై వటుడింతయై, మరియు దానింతై నభో వీధిపై
నంతై, తోయద మండలాగ్రమునకల్లంతై, ప్రభా రాశిపై
నంతై, చంద్రునికంతయై, ధృవుని పైనంతయై, మహర్వాటి పై
నంతై, సత్య పదోన్నతుండగుచు బ్రహ్మాండాంత సంవర్ధియై

ఈ పద్యం పోతన భాగవతంలో వామన ఘట్టంలో వున్నది. బలి దానమిచ్చే సమయమున శ్రీమన్నారాయణుడు తన విశ్వరూప ప్రదర్శనతో భూమి ఆకాశములను ఆక్రమించి బ్రహ్మాండ రూపాంతరము చెంది మూడవ పాదము కొరకు చోటేది అని అడుగుతాడు.

ఈ పురాణ ఘట్టాన్ని మూడు విధముల వివరణ ఇవ్వడం జరిగింది. పోతనగారు తెలుగువారి పుణ్యపేటి. “భాగవతము జగత్ హితంబు”. పోతన మహాకవి వామన ఘట్టంలో శ్రీమన్నారాయణుడు త్రివిక్రమావతారాన్ని ఆయన ఎలా పొందాడో వివరిస్తూ, ఆయన క్రమ క్రమంగా ఎలా పెరిగారో, పెరుగుదల గురించి దానిని ఏకోణంలో ఏ యోగ ప్రకారము చూడవచ్చో అన్నదానికి కుండలినీ శక్తి మూలాధారం, స్వాధిష్ఠానం, మణిపూరకం, విశుద్ధి, అనాహతము, ఆజ్ఞా చక్రము ఇలా పై పైకి సహస్రారం చేరుకొనే ఒక క్రమంలో చెప్పుకోవచ్చు.

పురుష సూక్తంలో స్వామి యొక్క సమగ్ర రూపంలో సహస్ర శీర్ష పురుషః అని ఆయన రూపాన్ని అన్ని రూపాలు, అన్ని శీర్షములు ఆయనవేయని చెప్పవచ్చు.

యోగ మార్గంలో మానవ జన్మను సార్ధకం చేసుకుంటూ జీవితాన్ని గడపాలి. యోగం అనగా కుదురు. ఏకాగ్ర సాధనతో మనం కుదురు తెచ్చుకోవాలి. యోగ మార్గంలో పైపైకి ఎదగాలి అని అర్థం.

ఏది చెప్పినా మానవ ఉన్నతిని, అభ్యుదయాన్ని మన పురాణం విశదీకరించింది. ఆ పద్యం ఒక్క మాటలో పెరిగినారని చెప్పినప్పటికీ కవిత్వం యొక్క ప్రయోజనం ఏమిటంటే దానిలో వున్న అంతరార్థం మనలను ఆలోచింపజేస్తుంది. సంగీతం విని ఆనందిస్తాము. సాహిత్యం ఆలోచనామృతం. సంగీత సాహిత్యాలు మనలను తరింపజేయుటకు ఏర్పడిన కళలు. శాశ్వతమైనవి. ఏదీ వదలి వేయకూడదు. అందువలన “ఇంతితై” మొదలుకొని “బ్రహ్మాండాంత సంవర్ధియై” వరకు మన సాధనక్రమము అట్లా ఉండాలి. ఉత్తరోత్తరా అభివృద్ధి చెందాలి. మధ్యలో ఆగిపోకూడదు. కుండలినీ యోగా అనుకొన్న అనేక రకముల యోగ

దర్శనములు అనుకున్నా ఒక్కొక్కరు ఒక్కో విధముగా చెప్పినది ఈ యోగ క్రమంలో మనం జ్ఞానాన్ని, మోక్షాన్ని పొందవచ్చు.

పలికెడిది భాగవతమట
పలికించెడి వాడు రామభద్రుండట నే
పలికిన భవహర మగునట
పలికెద వేరొండు గాథ పలుకగనేలా

మనిషి పుట్టుక గురించి వ్యాఖానిస్తూ కుదురరి గారు జంతూనాం నరజన్మ దుర్లభం. ఆలోచించడం మనిషి ప్రత్యేకత. మానవ జన్మ ఎత్తినందుకు వూరికే నిద్ర, తిండి, పని ఇవియే కాకుండా జన్మకి ఒక ప్రయోజనం ఉందని భారతీయ సంస్కృతి సిద్ధాంతం. మనిషికి శక్తి వున్నప్పుడే జన్మ తరించే ఉపాయం తెలుసుకొని ఆచరించాలి. హరి కీర్తన చేయుట వలన పాపాలు హరమగును. పలికెద వేరొండుగాథ పలుకగ నేల, ప్రాణులకు నోరిచ్చినందుకు వాక్కుని, జ్ఞానాన్ని, బుద్ధిని సద్వినియోగం చేసుకొని వాక్కు ద్వారా భగన్నామ సంకీర్తన చెయ్యాలి. భగవంతుని సందర్శించు కొనుటకు ప్రయత్నం చెయ్యాలి. చిన్ని పదాలతో అందంగా పోతన మహాత్ముడు మనకి చెప్పారు.

మానవ జన్మ సార్ధకత చేసుకొనుటకు బ్రతకాలి. మనం రోజూ ఊపిరి తీయుట విడుచుట మనకు తెలియకుండానే జరిగి పోతుంటుంది. తల్లిదండ్రులు మనకు జన్మనిచ్చారు గాబట్టి వాళ్లకు సర్వదా కృతజ్ఞతలు తెలుపుకుంటూ అటువంటి నరజన్మకు ప్రయోజనం తెలుసుకొని సార్ధకం చేసుకొనుట మనిషి కర్తవ్యం.

దాని కోసమే మనమందరము సమావేశమయ్యాము. అనగా సత్సంగమైనా, అవధానమైనా, పారాయణమైనా ప్రయోజనం ఉంటుంది.

దానిని మనం సముపార్జన చెయ్యాలి. సత్సంగత్వం వలన మనకి ఏవి కత్తరించుకోవాలో తెలుస్తుంది. అదే నిస్సంగత్వం అనవసరమైనవి పట్టించుకొనుట, సమయం వృథా చేసుకొనుట ఇవ్వన్నీ అనవసరం. నిస్సంగత్వం అంటే అందరికీ దూరంగా ఉండుట యని కాదు, అందరితోనూ ఉంటూనే కత్తిరించుకోవాలి అని అర్థం. సాక్షి మాత్రంగానే మనం ఉండాలి. శంకరాచార్య భగవత్ పాదులు అన్నట్లు సత్సంగత్వమే నిస్సంగత్వం. నిస్సంగత్వమే నిర్మోహత్వము. నిర్మోహత్వమే నిశ్చలతత్వం, నిశ్చల భక్తే జీవన్ముక్తి. అప్పుడే ఏకాగ్రత కుదురుతుంది. ఏకాగ్రతలోనే జీవుడు ముక్తిని సాధిస్తాడు. ముక్తి మార్గమే మానవుని యొక్క జీవన గమ్యం.

**మలి సమస్య :**

ఆకాశము, శ్యామలానంద ప్రసాదు గారి పేరులోని శ్యామల అనగా నీలము అని రెండిటిని సమన్వయ పరచి ఈ పద్యం అడుగరి గారు ఇచ్చి పురాణ విశేషాలు వివరించమనిరి.

ఆకాశంబున నుండి శంభుని శిరంబందుండి శీతాద్రి సు
శ్లోకంబైన హిమాద్రినుండి భువి భూలోకమ్ము నందుండి య
స్తోకాంబోధి పయోధి నుండి పవనాంధో లోకమున్ చేరె గం
గా కూలంకష పెక్కు భంగులు వివేకభ్రష్ట సంపాతముల్

రెండు వేల సంవత్సరాలకు పూర్వం భర్తృహరి మహాకవి రచించిన సుభాషిత త్రిశతికి ఏనుగు లక్ష్మణ కవి సుభాషిత రత్నావళి అను తెలుగు అనువాదం. ఇది నీతి శతకం. అన్యమనస్కంగా పయనించిన గంగ యొక్క మనస్థితి ఇందులో వివరించబడినది. దివి నుండి భువికి దిగి వచ్చిన గంగ ప్రవాహ మార్గంలో ఇక్కట్లు ఈ పద్యంలో విశదీకరించారు.

యదార్థమునకు గంగకు భువికి రావడం ఇష్టం లేదు. ఒక ప్రయత్నఫలంగా భగీరథుడు ఘోర తపస్సు చేసి, గంగను భువికి తీసుకొని రావటానికి అనుమతి పొందాడు. గంగ తాను భూమి మీదకు వురికినట్లైన భూమి బ్రద్దలై పోవును. కావున నన్ను పట్టు ఉపాయం చూడమని భగీరథుడుకి సూచిస్తుంది. అప్పుడు శివుడు నేను సాయపడ తాను అంటాడు. ఆ విధంగా శివుడు ఆపు చేస్తాననుట గంగకు క్రోధ కారణం అవుతుంది. కోపంతో ఉధృతముగా దూకుతూ వేగంగా శివుని శిరస్సుపై దుముకుతుంది. శివుడు తన జటాఝూటంలో కట్టి పడేస్తాడు. అక్కడి నుండి శీతాద్రిపై పడుతుంది. అక్కడ సంపూర్ణంగా రాలేక పోయింది. అక్కడి నుండి భూమి మీదకు వచ్చింది. శివుని జడలలో ఎక్కువగా బంధించ బడినది. నిజానికి శివుని శిరస్సు బ్రద్దలు గొడదా మనుకుంది. కానీ శివుడు తన జటలో ముడివేసి ఎదుర్కొన్నాడు. హిమాలయాల్లో దిగి అప్పటికీ శాంతించలేదు. ప్రశాంతత లేదు. ఊగిపోతూ, ఉరకలెత్తుతూ యజ్ఞం చేసుకుంటున్న జహ్ను మహర్షి ఆశ్రమాన్ని ముంచెత్తి వేసింది. ఆయన విపరీతమైన క్రోధంతో తన తపోబలంతో గంగా నదిని పీల్చేస్తాడు. భగీరథుడు వెనక్కి తిరిగి చూడగా గంగా నది కనిపించకపోతే మహర్షిని వేడుకొనగా చెవినుండి గంగను విడిచి పెడతాడు. ఆ కారణం గానే ఆ నదిని జాహ్నవి అనికూడా పిలుస్తారు. ఈ విధంగా మనఃపూర్వకముగా కాకుండా అయిష్టంగా భూమి మీదకు వచ్చినందువలన ఇన్ని ఇబ్బందులు, ఇక్కట్లు పడినది. "వివేకా భ్రష్ట సంపాతముల్" వివేకము కోల్పో యినట్లైతే అనేక ఇక్కట్లు, సంతాపము కలుగునని కుదురరి గారు ముగించారు.

**వ్రాపెట్టు (చిత్రాక్షరి) :**

కాలుష్యం కోరల్లో చిక్కుకున్న ప్రకృతి, పర్యావరణాన్ని పరి రక్షించుకోవాలంటే ఏమి చేయాలి అనే సమస్యను తేటగీతి పద్యంలో చెప్పమన్నారు.

నియమం : మొదటి పాదంలో 12 అక్షరాలు ఉండాలి.

నింగిపోయెను బాపురే నేల పోయె
గాలి పోయెను అగ్గియు కనలి హెచ్చె
నీరు పాడయి పోయెను మీర లెరిగి
చక్కదిద్దక బతుకింక సాగ బోదు

భావం : పంచ భూతములు చక్కగా నుండనట్లయిన మన బ్రతుకులు ఆరోగ్యకరంగా నుండవు. కాలుష్యం పెల్లుబుకుతుంది. వాతావరణ కాలుష్యం పోవాలి. అందరి బ్రతుకులు ఆరోగ్యకరంగా ఉండాలి. కాలుష్య కోరల్లో చిక్కుకొనకుండ వుండాలని కుదురరి గారు నీతిని ప్రభోదించారు.

**నుడిపెట్టు (దత్తపది) :**

తిరుగలి, రోలు, రోకలి, పొత్రము ఈ పదాలు వాడుతూ ఇంటాయన కోపాన్ని తగ్గిస్తూ నచ్చచెప్పాలి.

రోలు మద్దెల మొరలయ్యె ప్రోల చెప్ప
ఎవ్వరో కలికమ్మిట నిచ్చువారు
తిరుగలిని అల్కబోయుచు త్రిప్పువారు
పొత్రమున రుబ్బు వారల పొగరు నెల్ల

"రోలు మద్దెలతో మొరపెట్టుకుందట" అని చమత్కరించారు.

భావం : భార్యాభర్తల మధ్య వచ్చిన ఏ గొడవైనా, చికాకైనా ఎవరితో చెప్పిన తీర్చేది కాదు. తీరేది కాదు. ఆయుర్వేదంలో కలికం అనే మందును కోపం తోనూ పొగరుతోనూ పోల్చి భర్త కోపాన్ని తిరగలిలో వేసి త్రిప్పి, పొగరును పొత్రమున వేసి రుబ్బే వారని పద్య భావన.

ఇప్పుడు ఆ వస్తువులు లేవు కాబట్టి వాటి జోలికి పోకుండా ఉండటమే మంచిది. భార్యా భర్త కోపతాపాలు, అలుక లేకుండా ఉండాలని కుదురరి గారు చెప్పారు.

**వడికట్టు (ఆశువు) :**

తొలి సమస్య : మీరు శివుని కోసము తపస్సు చేస్తున్న సమయంలో రంభ, ఊర్వశి, మేనకలు మీ ముందు రకరకాల నృత్యాలు చేస్తూ, మీ తపస్సు భంగం గావింపచూస్తున్నారు. మీకు వారి పట్ల ఆసక్తి, అనురక్తి వుండవు కనుక వారు వెళ్లి పోయేటట్లు ఆశువుగా పద్యము చెప్పమనిరి.

ముక్కంటి చేరుకొనగా
చక్కగ సాగించుచుండె సరియగు కుదురున్
ఇక్కడ పని సాగదు ఇం
కెక్కడికైనన్ చనవలె నిక నచ్చరలున్

భావం : కుదురుగా శివుని చేర తపమాచరించు స్థానమున మీ పనులు సాగవు గనుక ఇంకెక్కడికైనా వెళ్ళమని అప్సరసలను అనుట ఇందలి భావము.

మలి సమస్య : తిరుపతి వెంకటేశ్వర స్వామి దర్శనానికి వెళ్లిన త్యాగరాజ స్వామి పూజారులు తెర వేసేస్తే, "తెరతీయగా రాదా" అనే కీర్తన పాడి, కీర్తించి భగవద్దర్శనం పొందినట్లు చరిత్ర చెపుతుంది. అదే విధముగా మీరు దర్శనార్థమై వెళ్ళినప్పుడు తెర వేసేస్తే మీ మానసిక పరిస్థితి ఏమిటి? వెంకటేశ్వర స్వామిని ఎలా ప్రార్థిస్తారు?

వడిగా పోవలె సామీ
విడిగా కననీరు నిన్ను వేగిర మొప్పన్
పడి పడి తోతురు గావున
విడిగా నిను వేడుకొనక వెళ్లెదనిపుడే

భావం : వేగంగా నిన్ను దర్శనం చేసుకొని వెళ్లి పోవాలేగాని విడిగా నిన్ను ప్రశాంతముగా దర్శనము చేసుకోడానికి వీలు లేదు. ఎందుకనగా వెనుకనున్న వారు పడి పడి తోసివేస్తారు. గావున విడిగా నిన్ను వేడుకొనకుండగనే వెళ్లి వత్తును అని ఈ పద్య భాగమును కుదురరి గారు ముగించారు.

**నుడికొట్టు (అప్రస్తుత ప్రసంగం) :**

ఈ ఏడాది పంచాంగ శ్రవణంలో ఆడువారిదే పైచేయి అన్నారు. కాబట్టి, ఎప్పుడూ ఆలస్యం నిదానం అని మా ఆవిడ పాటిస్తూ ఉంటే ఈ సంవత్సరము నా సమస్య, బాధ ఎలాగ అని నుడికొట్టు అడుగరి కోరగా, కుదురరి గారు ఇది అప్రస్తుత ప్రసంగం కాదు, ప్రస్తుత ప్రసంగమే అని ఛలోక్తి విసరగా సభలో నవ్వులజల్లు కురిసాయి. ఈ విళంబి అనేది ఇప్పుడు వచ్చినది కాదు, వివాహం అయిన దగ్గర నుండి ఉండేదే. వివాహ వ్యవస్థలో వుండే మాధుర్యం అదే. భవభూతి చెప్పినట్లుగా "అద్వైతం సుఖదుఃఖయో రనుగతం" స్నేహితులుగా ఉండాలి. మానవ సంబంధాల మధ్య ఉండవలసిన అనుబంధాలు పాలు నీరు లాగ కలసిమెలసి ఉండాలి గాని. కలహాలకు పోకూడదు. జీవితం సుఖ దుఃఖాల మిళితం. పంచుకుంటూ ముందుకు సాగాలి. భార్యా భర్తలిద్దరూ కలిమి లేములు కలసి మెలసి పంచుకుంటూ అద్వైత స్థితి పొందుతారు. అలా ఉంటేనే ఆ కాపురం కలకాలం కొనసాగుతుందని మానవ సంబంధాల గురించి భవభూతి మహాకవి ఉత్తర రామ చరితంలో

ఉద్ఘాటించారు. దేవాలయ దర్శన ప్రయోజనము గురించి కుదురరి గారు చెప్తూ దేవాలయానికి వెళ్లి దర్శనము అయిన వెంటనే వచ్చి వేయకుండా మూల విరాట్టుని ధ్యానించి కొంత సమయము కూర్చొని వెళ్ళవలయును. ఎందుకనగా మూలవిరాట్టులోని శక్తి తరంగాలు మన మీద కూడా ప్రసరించి, మన అంతరంగం శుద్ధిపొంది మనోవికాసం చెందుతుంది. ప్రతీ కార్యంలో సత్వ, రజో, తమో గుణాలు ఉంటాయి. మనం ఏ పనినైనా సత్వ గుణం గానే చెయ్యాలి. గాలి గోపురం వద్ద కలశస్థాపన చేస్తారు. ఆకాశమంత వ్యాపించి యున్న పరబ్రహ్మ స్వరూపమైన శక్తి గాలిగోపురం ద్వారా గర్భాలయంలో ప్రవేశించి మూల విరాట్టుని ఇంకా ఇంకా శక్తివంతం చేస్తుంది. యోగులు, సన్యాసులు దేవాలయములలో దర్శనం చేసుకుంటూ వుంటారు. వారు పాదం మోపినందు వలన కూడా దేవాలయాలు శక్తివంతముగా మారతాయి. అలాంటి మూల విరాట్టుని మనం దర్శనం చేసుకొనుట వలన ఆ కిరణ ప్రసారం జరిగి మనం శక్తిమంతులం కాగలము. ముఖ్యంగా అంతర్ దృష్టి ఏర్పడుతుంది.

"విళంబి"ని పేరుగల సంవత్సరము విశేషణం : "విలంబి"ని విళంబిలాగా పలకడం లోనే దాని ప్రత్యేకత ఉంటుంది. "వి" ఉపసర్గ "ళ" సంస్కృత మూలధాతువు. లంబము అనగా ఆగి ఉండుట అని అర్థం. దానిని మనం గణితంలో నిలువుగా ఉండేది లంబ కొణమని చెప్పుచున్నాము. అలా అర్థాంతర మార్పులు కూడా జరుగుతుంటాయి. ఆగుట అనేదానిని ఆలస్యమని చెపుతాము. వి అనే ఉపసర్గ ఆగుట అనే అర్థాన్ని ఇస్తుంది. ఎందుకనగా మూల ధాతువులో నున్న శబ్దానికి ఉప సర్గలు చేర్చుకునే అవకాశం సంస్కృత వ్యాకరణమునకు వున్నది. అలాంటిది ఏ వ్యాకరణమునకూ లేదు. పాణిని మహర్షి అలాంటి అష్టాధ్యాయినిని మనకిచ్చి వ్యాకరణ పుష్టినిచ్చారు. వాఙ్మయ వ్యాకరణమే చాలా గొప్పదని చెప్పవచ్చు.

మానవ జీవన వికాసమునకు సంబంధించినదైతే, ఈ విళంబి సంవత్సరము కళలకు సంబంధించిన అర్ధం కూడా వస్తుంది. విలంబమనగా నిలబడి చేసే పని. స్థిరంగా దృఢంగా ఉంటుందని అనుకోవచ్చు.

ఏతావాతా అని నుడికొట్టు అడుగురి అనగానే కుదురరి గారు అలా కాదు. ఏతావతా అని సరి చేసి ఈ చెప్పిన దానిని బట్టి అన్న అర్థంలో పై మాట వాడతారన్నారు.

అవధానమనగా ఏకాగ్రత, ఏకాగ్రత అనగా కుదురు. కుదురరి గారికి కుదురుగా ఉండడం అలవాటు అయినది కదా మొన్న విమానము దిగిన సమయాన్న మీ సామానులలో ఒక పెట్టె కనిపించింది, ఒకటి కనపడ లేదు. అప్పుడు మీరు ఎలా బాధ పడ్డారు? మీ శ్రీమతిగారు లోపలికి రానిస్తారా రానివ్వరా? ఆమెకు ఇంకొక తరగతి వున్నది ఆవిడ వెళ్ళవలసిన కాలము ఆసన్నమైనది. అప్పుడు మీ పరిస్థితి ఏమిటి అని నుడికొట్టు అడుగురి అనగానే దానికి కుదురరి గారు సమాధానం:

చింకి చేతనుండె చేకొన వచ్చును
తిరిగి వచ్చినేని మరలిపోదు

ఇటువంటి సమస్యే 2016 లో తనికెళ్ళ భరణి గారికి, మురళి మోహన్ గారికి హ్యూస్టన్ వచ్చినప్పుడు అనుభవమయ్యింది. విమానాశ్రయం స్టేషన్లో ఫిర్యాదు చేసి అలానే వచ్చేసారు. మరుసటి రోజు కార్యక్రమానికి వేదికమీదకు కావలసిన వస్త్రాలు లేకపోతే ఇక్కడివారే సమకూర్చిరి.

కుదురరి గారు వెజ్జ అనగా వైద్యుడు అన్నారు కదా. నాన్ వెజ్ కూడా వుంటారా అంటే వైద్యుడు కానివారు.

సుమతి శతకంలో అప్పిచ్చువాడు, వైద్యుడు అన్నదానిని అప్పు ఇచ్చువాడు, వైద్యుడు అని ఎలా తీసుకుంటున్నారో "అప్" ఇచ్చు వాడు కూడా వైద్యుడే అని చెప్పుకోవచ్చని కుదురరి గారు హాస్యోక్తులు కురిపించారు.

కుదురరి గారూ పంచాంగ శ్రవణం సందర్భంలో ఈ సంవత్సరము సస్యాధిపతి చంద్రుడు అని చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాలకు ఇద్దరు చంద్రులు వున్నారు. వారు పొలాలు దున్నుకుంటూ వ్యవసాయం చేసుకుంటే ఇక్కడ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల పరిస్థితి ఏమిటి? వారు దున్నుకోవడం లేదు, పండే పొలాలు ఖాళీగా వుంచేస్తున్నారు. అక్కడ ఏవేవో కంపెనీలు పెడతామని ఆశ చూపిస్తున్నారు. దూరంగా వున్నవారికి తెలియుట లేదు గానీ ఇరువది ఐదు నుండి ముప్పది వేల ఎకరాల పొలాలు ఎండిపోయి ఖాళీగా వున్నాయి. మనుష్యుల కోసం అన్వయించు కోవడం కంటే చంద్రుడు ఓషధీపతి గనక ఆయన కిరణములచేత మొక్కలు శక్తివంతమై ఫల పుష్ప పత్రములు ఇస్తాయి.

కుదురరిగారూ మీరు వెజ్ అనే అనుకున్నాను గానీ మీ "షడ్దర్శనాలు" పుస్తకంలో సాంఖ్య, యోగ, న్యాయ, వైశేషిక అన్నంతవరకు ఇబ్బంది అనిపించలేదు. ఆ తరవాత పూర్వ మీమాంస, ఉత్తర మీమాంస అని వ్రాయడంతో మీమీద నాకు శంక ఏర్పడినది.

పూర్వ మీమాంస, ఉత్తర మీమాంస అనునవి ప్రధానమైనవి. వేదంలో పూర్వ మీమాంస, ఉపనిషత్తులలో ఉత్తర మీమాంస ఇమిడి వున్నవి. పూజ పునస్కారాలు, యజ్ఞ యాగాదులు ఇవ్వన్ని చేయుట, వాటి విధి విధానాలు, వాటి ఫలితాలు, వాటి వలన జ్ఞానాన్ని ఎలా పొందుతారు అన్న విషయాలు విశదీకరిస్తుంది.

కుదురరి గారూ అక్షరాలు అకారం, వకారం, నకారం అని అంటారు గదా ఈ కారములు ఎందుకు వాడతారు. అలంకారం ఉండాలి, మమకారముండాలి ఇవి ఉంటేనేగానీ జీవితాలు గడవవు. కానీ ఎక్కువ కాకూడదు. సమపాళ్లలో ఉండాలి అని కుదురరి గారు కుదుట పరిచారు. ఏదైనా తగుపాళ్లలో పరిమితిలో ఉంటేనే బాగుం టుందని అన్నారు. వేలు వంచనిదే వెన్నయినా దొరకదని సామెత చెబుతూ ఏక వాక్యంలోనే ఏంతో అర్థాన్ని నిబిడీకరించి పెట్టారు మన పెద్దలు. తెలుగులో తిట్లయినా పర్వాలేదు, తెలుగు మరచి పోకుండా తెలుగులోనే తిట్టుకోండని చమత్కరించారు. నీ జిమ్మడా, సచ్చినోడా లాంటి తిట్లలో అంతర్భాగంలో నున్న అంతరార్థం చెప్పారు. తెలుగులో ఆ తిట్లు ఏ ఉద్దేశ్యంతో తయారయ్యాయంటే మనకి శాపనార్థాలు, శాసనార్థాలు, మనల్ని శాసిస్తాయి. “నీ శ్రాద్ధం చెట్టుకింద పెట్ట” ఈ తిట్టు కారణంగా పసితనం నుండే మానసికంగా ఏదిచెయ్యాలో, ఏది కూడదో అనే అభిప్రాయాలు ఏర్పడతాయి. వ్యక్తిత్వ వికాసమునకు కూడా చేయూతనిస్తాయి. ఎలాగంటే పెద్దవాళ్ళు “చచ్చినోడా” అంటే పుట్టిన వాళ్ళందరూ ఏదో ఒకనాడు చచ్చిపోతాము అన్న సందేశం ఇచ్చినట్టు, అది మానసిక స్థిరత్వానికి నాంది. అమ్మ నాన్నలు ఉండి అన్నీ చూస్తారు అని కాకుండా, వీళ్ళు కొన్నాళ్ళు ఉండి వెళ్ళిపోతారు. తరువాత మనము కూడా వెళ్ళిపోతాము. మానవుల సంబంధాలన్నీ కొన్నాళ్ళు మాత్రమే.

“జాతస్యహి ధ్రువో మృత్యు : “పుట్టినవాడు గిట్టక తప్పదు అన్న అంతరార్థాన్ని చిన్నప్పటి నుండి వాళ్ళ అంతరంగంలో ముద్ర పడుతుంది. అందుకే భగవద్గీతలో కృష్ణుడు ఆవిధంగా బోధ చేసాడు. మన తెలుగు తిట్లు వైరాగ్య ధోరణిని ప్రోదిచేస్తూ మానసికంగా భౌతికంగా సిద్ధపరుస్తాయి.

“జిమ్మా బొమ్మ పండుగ” అంటే ఏమిటి అని అడుగగా కుదురరి గారు తీపి, వగరు, పులుపు మొదలగు షడ్రుచులు కూడగలిపి రుచి

చూసే పండుగ ఇది ఉగాది. దీనిని గుర్తు చేసుకొనుట అంటే పునశ్చరణ. అట్లాగే ఈరోజు ధర్మ శాస్త్రప్రకారం బ్రహ్మదేవుని పూజించాలి అంటారు. ఎందుకంటే సృష్టియొక్క స్వరూపం, సృష్టికర్త అయిన బ్రహ్మ ఇవ్వన్నిటినీ పెట్టాడు. యుగాది అంటే ఏటిమొగ పండుగ. జిమ్మా బొమ్మ పండుగ రుచుల కోసం జిహ్వాను వాడేస్తే దేహం పాడైపోతుంది. కావున రుచులు అనేవి మన బుద్ధికి ఉండేవేగాని, జిహ్వాకు కాదు. ఆహార విషయంలో గానీ, నోరు పారేసుకొనే విషయంలో కానీ "నరము లేని నాలుక" ఎలా అన్న మాట్లాడుతుందంటారు. అదికూడా బుద్ధి ప్రభావమే. అది ముప్పది రెండు పళ్ళ మధ్య ఎంత జాగ్రత్తగా బ్రతుకుతుందో సమాజంలో మనం కూడా అందరి మధ్య అలాగే భద్రతగా జాగ్రత్తగా వుండాలని జిహ్వా ద్వారా మనం తెలుసు కోవచ్చు. అది యెట్లా సద్వినియోగం చేసుకోవాలో అలాగే సంవత్సరం మొదటి రోజున ఈ కోణంలో ఆలోచించు కోవాలి. లేకుంటే ఎక్కడో వేప పూవు తెచ్చి, ఎక్కడినుండో మామిడి తెచ్చి ఎందుకు ఇవి చేస్తున్నాము. అనగా ఒకరు ఉగాది పచ్చడి అంటారు ఒకరు ప్రసాదము అంటారు. దీని ద్వారా మనం ఒక స్ఫూర్తితో బ్రతకాలి అని అర్థం.

కుదురరి గారు ఉగాది రోజున బ్రహ్మను పూజించాలి అన్నారు. కానీ బ్రహ్మ కనిపించరు కాబట్టి ఆయనను కుదురరిలో చూసుకొని ఆనందోబ్రహ్మ అని పూజచేసి దక్షిణలు ఇక్కడ ఇవ్వండి అని నుడికొట్టు అడుగురి అనగా ఇక్కడ విశేషం వుంది. మీరు అక్కడ పూజ చేసి, దక్షిణ ఇక్కడ ఇవ్వ వచ్చు కదా అని కుదురరి గారు చమత్కరించేసరికి సభలో నవ్వులు వెల్లివిరిశాయి.

చివరగా నుడికొట్టు అడుగురి ఎనుకుదురాట కాలాతీతమైనది అని తెలియజేయటానికి – ఈ సభాస్థలి వున్న దేవాలయం మూసే సమయం ఆసన్నమైనది. చేపలుకు (మొబైల్) ద్వారా పొట్టిపదము (ఎస్ ఎం ఎస్) పంపించారని అనగానే సభలో నవ్వుల పువ్వులు కురిశాయి.

సమయాభావం వలన ధారణా ప్రక్రియను మార్చి అడుగరులు సమస్యా పూరణ పద్యాలు చదువగా కుదురరి గారు విపులీకరించి వివరణతో అర్ధ తాత్పర్యములను అర్ధవంతంగా విశదీకరించారు.

పరమేశ్వరి గురు కరుణన్
పరిపూర్ణత కాంచె నిదియు బాగో ఓగో
గురువులు మిత్రులు మీరలు
సరసత నాశీర్వదింప సంప్రార్ధింతున్

**కుదురరిగారి జీవిత విశేషాలు :**

శ్రీ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ గారు గుంటూరు జిల్లా పొన్నూరులో పూర్ణమ్మ, వెంకట సుబ్బారావు దంపతులకు అక్టోబరు మూడు, పందొమ్మిది వందల ఏబది ఏడున జన్మించారు. ఆయన కృష్ణా జిల్లా అవనిగడ్డలో ప్రాధమిక, మాధ్యమిక విద్య పూర్తిచేశారు. మండలి బుద్ధప్రసాద్ గారు ఈయన సహాధ్యాయి. కుదురరి గారు పొన్నూరు శ్రీ భావనారాయణ స్వామి సంస్కృత కళాశాలలో విద్యనభ్యసించారు. భానుమతి గారిని అర్ధాంగిని చేసుకున్నారు. సంస్కృతాంధ్రములలో ఎం.ఏ. పట్టాలు పొంది రెంటిలోనూ పి.హెచ్‌డి. సాధించారు. సంస్కృతంలో "విశ్వనాధ సత్యనారాయణ" గారు రాసిన రూపకాలపై పరిశోధన చేసి సంస్కృతములో డాక్టరేట్ పొందారు. విజయవాడ సయ్యద్ అప్పల స్వామి కళాశాలలో సంస్కృతాంధ్ర శాఖాధ్యక్షులుగా, ప్రధానాచార్యులుగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసినారు.

**సంస్కృత రచనలు**

1. పంచారామ పంచభూత శివ సుప్రభాతము
2. శ్రీ షిరిడి సాయి సహస్ర నామ స్తోత్రము
3. శాంతి సూక్తము
4. కాశీలోని విశ్వేశ్వర స్వామి సుప్రభాతము

**తెలుగు రచనలు :**

1. మనస్సాక్షి మహాభారతం
2. పద్మ వంశీ
3. తల్లా పిచ్చెయ్య శాస్త్రి సాహిత్య ప్రకాశం *(పరిశోధనా గ్రంథము)*
4. ధర్మభిక్ష పద్య కావ్యము
5. జైన ధర్మ శతకం
6. వెంకయ్య స్వామి జీవిత చరిత్ర
7. కాశీ సారం
8. పద్మ వంశీ పద్య కావ్యం
9. షడ్దర్శన ప్రస్థానం
10. ఏకాదశి సుప్రభాతం

**అవధాన ప్రక్రియలు :**

1995 లో విజయవాడ ఏకదిన సంపూర్ణ సంస్కృతాంధ్ర శతావధానం చేశారు. తాడికొండ గోగినేని కనకయ్య సంస్కృత కళాశాలలో సంస్కృతావధానం చేశారు.

2009 లో అచ్చతెనుగు అష్టావధానాన్ని విజయవాడలో ప్రారంభించారు.

2013 లో డల్లాస్‌లో జరిగిన 19వ తానా సభలలో గరికపాటి నరసింహా రావు గారితో కలిసి అవధానం చేశారు.

2014 లో లండన్ పార్లమెంట్ హౌస్‌లో ఆశుకవితా ప్రదర్శన చేశారు

2016 లో అమెరికా, ఆస్టిన్‌లో అచ్చ తెలుగు అవధానం చేసినారు. అక్కడ అవధాని గారికి "కనకాభిషేకం" అతి వైభవముగా జరిగింది.

ఆ సంవత్సరమే అమెరికా, హ్యూస్టన్ నగరంలో అచ్చ తెలుగు అవధానం చేసిన అవధాని గారికి "అసమాన అవధాన సార్వ భౌమ" బిరుదు ప్రధానం జరిగింది.

2017 లో అమెరికా, డల్లాస్ నగరంలో అవధాని గారిని "అవధాన శిరోమణి" బిరుదుతో సత్కరించారు.

ఏతావతా 25 కు పైగా అచ్చతెలుగు అష్టావధానాలు, 3 శతావధానాలు కలుపుకొని 500 కు పైగా అవధానాలు చేశారు.

**పురాస్కారములు, బిరుదులు :**

అవధాన కళా సరస్వతి, అవధాన శారద, శతావధాని శేఖర, అవధాన చతురానన, అసమాన అవధాన సార్వభౌమ, అవధాన శిరోమణి, తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారము, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే 2015 మన్మధనామ సంవత్సర కళారత్న ఉగాది పురస్కారం. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే విళంబి నామ సంవత్సర కళారత్న (హంస) అత్యున్నత ఉగాది పురస్కారం

**అవధాని కావలసినవారు చదవ వలసిన పుస్తకములు :**

1. ఆంధ్ర నామ సంగ్రహము
2. అమరకోశము
3. నానార్ధ నిఘంటువు
4. సురక్షణ సారము
5. శతావధాన సారము
6. శతావధాన ప్రబంధము
7. అవధాన మంజూష
8. అవధాన విద్య